# 12. ప్రియురాలి హృదయం

నా నాశనానికే ఆమెను ప్రేమించాను. అసలు మనం ఎందుకు ప్రేమిస్తాం? ఈ విశాల విశ్వంలో ఒక్క మనిషి మీదనే కళ్ళుపడటం ఎంత ఆశ్చర్యం! హృదయంలో ఒకే కోరిక, ఒకే ఆలోచన – నీటిబుగ్గలాగు ఆత్మలోని లోతుల్లోనుంచి పైకి పొంగి పెదవుల సందునుంచి బైటపడే ఒక్కపేరు – తిరిగితిరిగి దాన్నే అన్ని స్థలాల్లోనూ అన్నివేళల్లోనూ ఒక ప్రార్థనలాగు జపిస్తూండటం – ఎంత ఆశ్చర్యకరం!

నేను మా కథ నంతట్నీ విపులంగా చెప్పనక్కర్లేదు. ప్రేమకు ఒక్కటే కథ – లోకంలో అది అంతటా ఒక్కటే కనుక. మేము కలుసుకున్నాం, ప్రేమించుకున్నాం – అంతే ఒక్క సంవత్సరంవరకూ – ఆమె అనురాగం, ఆమె కౌగిళ్లు, ఆమె ముద్దులూ, ఆమె చూపులూ, ఆమె గౌనులూ, ఆమె మాటలూ – ఇవ్వేనా సర్వప్రపంచమూను. ఆమెకు సంబంధించిన ప్రతివస్తువూ నన్ను బంధించి, ఒక గిరిలోనుంచి నన్నొక బానిసను చెయ్యగలిగింది. ఆ తన్మయత్వంతో నాకు పగలూరాత్రీ తెలియలేదు. ఇది పాతభూమా, క్రొత్త లోకమా అనే సందేహమూ, అసలు నేను బతికే ఉన్నానా, చచ్చానా అనే అనుమానమూ కలిగినయ్.

కాని, ఇప్పుడు ఆమె చనిపోయింది. ఎలాగో నాకు తెలియదు. అదంతా జ్ఞాపకం వుంచుకోలేదు. ఒకరాత్రి వానలో తడుస్తూవచ్చింది. మర్నాటి ఉదయం దగ్గుపట్టుకొని ఒక వారం ఏడిపించింది. ఆమె మంచం పట్టింది. ఆ తరువాత ఏమైందీ నాకు బాగా గుర్తులేదు. డాక్టర్లువొచ్చి కావాల్సిన మందులకు చీట్లురాసి వెళ్ళిపొయ్యారు. మందులు తెచ్చారు. ఎవరో ఆమెచేత మందులు త్రాగించారు. ఆమె చేతులు వేడిగా ఉన్నయ్.

ఫాలభాగం నిప్పుల్ని కక్కుతోంది. కళ్ళు అతి కాంతివంతముగానూ, విచారకరంగానూ ఉన్నయ్. ఆమెతో నేను మాట్లాడాను. జవాబు చెప్పింది. మేము ఒకరితో ఒకళ్లం మాట్లాడాం. నాకు గుర్తు చాలదు. అంతా - అంతా నేను మరిచిపొయ్యాను. ఆమె చనిపోయింది - కాని, చివరకు మూలుగుతూ ఆమె విడిచిన సన్నని నిట్టూర్పు నన్నింకా బాధిస్తూనే వుంది.

"అయ్యో!" అంది నర్సు.

ఇంకేముంది? నాకు అంతా - అంతా అర్థమైపోయింది.

ఆ తరువాత అంతా అంధకారమే! ఒక మతగురు వొచ్చి - ఆమె నా భార్యఐనట్టు ఏవేవో మంత్రాలు చదివాడు. వాటిని నేను దూషణలుగా భావించాను, ఎందుకంటే ఆమె చనిపోయింది కనుక. ఆమె ఎవరో, ఏమిటో ఇప్పుడు తెలుసుకునే అధికారం ఎవ్వరికీ లేదు. అందుకని ఆ మతగురువును బైటికిపొమ్మన్నాను. ఇంకో మతగురువు వొచ్చాడు. ఇతను కొంచెం పెద్దమనిషి. దయగలవాడు. అతను ఆమెను గూర్చి మాట్లాడుతూంటే నేను ఏడ్చాను. ఆమె శవాన్ని తీసుకువెళ్లేందుకు చేయాల్సిన పనులు ఒక వంద ఉన్నాయ్. వాటన్నిటినీ గూర్చిన జ్ఞాపకం నాకు లేదు. కాని, శవపేటిక బాగా గుర్తువుంది. శవాన్ని పెట్టెలోకి దింపాక, పైన మూతవేసి పెద్దపెద్ద మేకుల్ని సుత్తితో దిగగొట్టటం కూడా నాకు బాగా జ్ఞాపకం వుంది- ఎంత ఘోరం!

ఆమెను - నా ప్రియురాల్ని - పూడ్చిపెట్టారు. ఆ భూమిలో - ఒక గోతిలో పాతిపెట్టారు!. ఆ దృశ్యాన్ని చూసేందుకు ఆమె స్నేహితురాళ్ళు కొంతమంది వొచ్చారు. ఆ ప్రదేశంనుంచి నేను పరుగెత్తాను. చాలా సేపటివరకూ వీధుల్లో తిరుగులాడి ఇల్లు జేరాను. మర్నాడే దూరదేశాలకు ప్రయాణమయ్యాను.

నిన్ననే మళ్ళీ పారిస్ వొచ్చాను. తిరిగి నా గది - కాదు - మా గది, మాపక్క మా కుర్చీలు, మా బల్లలు, జీవంపొయ్యాక మిగిలే యీ జీవకళను మాత్రమే చూశాక నా దుఃఖం పొంగి పొరిలింది. గదిలోని కిటికీలోంచి కింది వీధిలోకి దూకి చద్దామనిపించింది. ఆ వాతావరణంలోనే నేను ఉండలేను. ఆమెను ఇన్నాళ్ళూ కాపాడిన యీ గోడలు, ఆమె శరీరంలోని అనేక వేల జీవకణాల్నీ, ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాల్నీ బాగా ఎరిగిన యీ గోడలమధ్య నేను ఉండలేను. ఈ కొంపలోనుంచి బైట పడదామని నా టోపీ తీసుకున్నాను. హాలులోని తలుపు దగ్గరకు వొచ్చి పెద్ద నిలువుటద్దంలోకి చూశాను. బైటికి వెళ్ళబొయ్యే ముందు తన ఆపాదమస్తకము జాగర్తగా అలంకరించుకుందీ, లేందీ చూచుకొనేందుగ్గాను ఆమె యీ అద్దాన్ని ఇక్కడ అమర్చింది. ప్రాణంలేనివాడిలాగు ఆ అద్దముందు నిలబడిపొయ్యాను. అద్దం ఎన్ని వేలసార్లు - ఎన్ని లక్షలసార్లు ఆమె పాపను చూపింది! ఈపాటికి తప్పకుండా ఆమె ప్రతిబింబం అద్దంమీద అచ్చుపడి ఉండాల్సింది! ఒణుకుతూ అక్కడ నిలబడి ఆ అద్దంలోకీ,

మెరిసేదాని చివరల్లోకీ చూశాను. ఇప్పుడు నా నిలువల్లా చూసినట్టే – ఆమెను కూడ ప్రతిబింబరూపంలో ఎన్నిసార్లు పట్టి ఉంచలేదు? ఆ అద్దాన్నే ప్రేమిస్తూన్నట్టు తోచింది, దాన్ని ముట్టుకున్నాను. అది చల్లగా...మళ్ళీ జ్ఞాపకాలు! అన్ని జ్ఞాపకాలే! అద్దం! బతికివున్నా క్రూరంగా, చల్లగా, బాధాకరంగా ఉండే అనుభవాల్ని జ్ఞాపకం చేస్తూన్న అద్దం! ఎవరి ఛాయలైనా చూపగల యీ అద్దం ఏ విధమైన జ్ఞాపక చిహ్నాన్నీ దాచుకోలేదు! మానవుడికి ఇలాటి హృదయమే ఉంటే ఎంతసౌఖ్యం! తాను అనుభవించిన అనుభవాలూ, తనముందు జరిగిన యీ ఛాయల్ని మరిచిపోగల హృదయమే ఉంటే అబ్బ.! యీ బాధ!

ఇంట్లోంచి బైటపడి, నాకు తెలియకుండానే శ్మశానానికి నడిచాను. అక్కడ నిరాడంబరంగా కట్టబడ్డ ఆమె సమాధినీ, దాని మీది క్రాస్ మార్కునూ చూచాను. దానిమీద ఇలా రాసివుంది!

“ఆమె ప్రేమించింది : ప్రేమించబడ్డది. చనిపోయింది.”

బరువైన ఆ రాతికింద ఆమె మన్నుగా మారుతూ పడివుంది. ఎంత బాధాకరమైన ఆలోచన! తలవొంచి బిగ్గరగా ఏడుస్తూ చాలాసేపటివరకూ అక్కడే నిలబడిపొయ్యాను.

తరువాత సాయంత్రం ఐనట్టు తోచింది. ఒంటరిగా చేయబడ్డ ప్రియుడు పిచ్చి భ్రమలు నన్ను బలంగా ఆవరించసాగినయ్. ఆమె సమాధి మీదకూర్చొని ఒక్క రాత్రి – చివరి రాత్రి మనసారా ఏడుద్దామనిపించింది. కాని నన్ను ఎవరైనా చూస్తే అక్కణ్నుంచి వెళ్ళగొడతారు. నేనేం చేసేట్టూ! నిరాశ ఆవరించబడ్డప్పుడు సహాయపడే మోసపు బుద్ధితో – చచ్చినజనం నివసించే ఆ పట్టణ వీధుల్లో తిరగసాగాను. చాలాదూరం – చాలాసేపటివరకూ తిరిగాను. మనం నివసించే ఆ పెద్దపట్టణంలో – యీ చిన్నపట్టణం ఎన్నో వంతు? ఐనా బతికిన జనంకన్నా ఆ చచ్చినజనమే ఎన్నో రెట్లు ఎక్కువ! బతికివున్న మనకు యీ పెద్ద ఇళ్ళూ, వెడల్పయిన యీ పెద్దవీధులూ, ఇంత భూప్రదేశం కావాలి. మన నాలుగుతరాలవాళ్ళమూ యీ భూమిమీద పండే ధాన్యాన్ని తింటూ నీటిని, సారాయిని, తాగుతూ బతుకుతున్నాం. కాని, ఇన్నితరాల జనానికి – మనకు ముందే జీవితాల్ని చాలించిన లెక్కలేని యీ సమూహానికి యీ కాస్త ప్రదేశమే చాలు! భూమాత ఇంతమందినీ యీ కాస్త ప్రదేశంలోనే ఇముడ్చు కోగలిగింది!

ప్రస్తుత ఉపయోగంలో వున్న సమాధిప్రదేశాన్ని ఆనుకొనివున్న ప్రదేశాన్ని జేరాను. శతాబ్దాల వెనుక చనిపోయినవాళ్ళ సమాధులు ఇక్కడ ఉన్నయ్. వారి శరీరాలు ఇప్పటికి మట్టిలో కలిసిపోయి ఉంటయ్. రేపో, ఎల్లుండో యీ ప్రదేశంలోనే కొత్త సమాధులు కడతారు. దట్టంగా పెరిగిన గడ్డిమధ్య బాగా ఎదిగిన గులాబీతోట ఇక్కడ ఏర్పడ్డది. విచారకరమైన యీ ప్రదేశంలోని యీ చెట్లన్నీ మనుష్య మాంసాన్ని తిని పెరిగినయ్. ఎవరికీ కనిపించకుండా యీ గుబురుచాటున ఒక్కణ్ణీ కూర్చున్నాను.

మునిగిపొయ్యే ఓడలోని నావికుడు, తెరచాపకొయ్యను ఆధారంగా తీసుకొన్నట్టు - నేను ఒక చెట్టు మొదట్ని ఆనుకొని వేచికూర్చున్నాను.

దట్టమైన చీకటి కమ్ముకున్నాక, మళ్ళీ నేను నడక సాగించాను. చాలా దూరం ... చాలాసేపు నడిచాను. కాని ... కాని ఆమె సమాధిని కనుక్కో లేకపొయ్యాను. పూర్తిగా తెరువబడ్డకళ్ళతో ముందుకు చాచినచేతుల్తో ప్రతిసమాధినీ తలతో కాళ్ళతో రొమ్ముతో ఎదుర్కొంటూ నడవసాగాను. కాని లాభం లేకపోయింది. కళ్ళున్నా నేను గుడ్డివాడితో సమానమయ్యాను. సమాధుల మీది అక్షరాల్లోకి వేళ్ళు పోనిచ్చి చదువసాగాను; కాని ఆమెను కనుక్కోలేక పోయాను. అదెక్కడ రాత్రి! కాళరాత్రి! సహాయానికి చంద్రుడైనా లేడు. ఆ వాతావరణం నాలో భయాన్ని ప్రవేశపెట్టింది. అటూ, ఇటూ సమాధులు ఆ మధ్య సన్నని దారి! సమాధులు తప్ప - ఇంకేమీ లేదు - అదెంత భయానక దృశ్యం!

నా కాళ్ళు ముందుకుసాగలేదు. ఒక సమాధిమీద కూలబడ్డాను. నా హృదయం కొట్టుకోవటాన్ని స్పష్టంగా వినగలుగుతున్నాను. నా చెవులకు ఇంకో శబ్దం కూడా తగిలింది. గాబరాపడ్డప్పుడు మనుషులు చేసే అలికిడి - అది! దానికి ప్రత్యేకమైన పేరేమీలేదు. ఇది నా బుర్రలోదా? లేక యీ అనంత గాఢాంధకారంలోదా? లేక నిగూఢమైన యీ భూమిలోని మనుషుల విత్తనాలదా? నా చుట్టూ చూశాను. ఏమీ కనిపించలేదు. అలా ఎంతసేపు వున్నానో నాకు తెలియదు. నాలో చలనమే పోతోం దనిపించింది. భయంతో పిచ్చెక్కేట్లుంది. భయంతో ఒక్క అరుపుతో చచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్టుంది! అకస్మాత్తుగా నేను కూర్చున్న సమాధిరాయి కదిలినట్టు 'ఫీ' లయ్యాను. దాన్ని ఎవరో బలంగా పైకి ఎత్తుతూన్నట్టుంది. ఒక్క గంతుతో పక్క సమాధి రాయిమీద పడ్డాను. నేను ఖాళీచేసిన రాయి పూర్తిగా లేవటాన్ని కళ్ళారా చూశాను. ఆ సమాధి గోతిలో నుంచి ఒక శవం - కాదు అస్థిపంజరం రాతిబరువును తన భుజాలమీద మోస్తూ పైకి వొచ్చింది. రాత్రి దట్టమైన చీకటితో ఆవరించబడివున్నా యీ దృశ్యాన్ని స్పష్టంగా చూడగలుగుతున్నా.

ఆ రాతిమీద ఇలా రాసివుంది;

"ఇది జాన్ ఓలివాన్ట్ సమాధి. వయస్సు యాభై ఒకటి. అతను తన తండ్రికి కృతజ్ఞుడుగా ఉన్నాడు. భార్యకు విశ్వాసపాత్రుడుగా, పిల్లలమీద ప్రేమతో దైవభీతిగల సజ్జనుడుగా జీవించి - భగవదేచ్ఛకు బద్ధుడై మరణించాడు."

నాలాగే అతనుకూడా దీన్ని చదివాడు. వెంటనే దారిలో పడివున్న సన్నని, పదునైనరాతిని తీసుకొని ఆ రాతిమీద అక్షరాల్ని గీకి పారెయ్యసాగాడు. కొంతసేపటికి దాని మీద అక్షరాలన్నీ మాయమయినయ్. లొట్టలుపడ్డ కళ్ళలోంచి తృప్తితో ఆ ఖాళీ రాతిమీదికి చూచాడు; తన చూపుడువేలి బొమికతో - గోడమీద మంచిరకం సిరాతో

రాసినంత తేలిగ్గా - స్పష్టంగా, కాంతివంతంగా ఉండే అక్షరాల్ని రాయసాగాడు. అది ఇలావుంది.

"ఇది జాన్‌ఓలివాన్‌ట్ సమాధి. వయస్సు యాభై ఒకటి. తండ్రి ఆస్తిని త్వరగా చేతుల్లోకి లాక్కునేందుగ్గాను నిర్దయగా ప్రవర్తించడం - అతని తండ్రి చావుకు కారణం. భార్యా, బిడ్డలకు అతను పరమదుర్మార్గు డయ్యాడు. ఇరుగు పొరుగుల్ని మిక్కిలి బాధించి, మోసపుచ్చేవాడు. అవకాశం దొరికినప్పుడల్లా దొంగతనం చేశాడు. ఎందుకూ పనికిరానివాడుగా మరణించాడు."

రాయటం పూర్తయ్యాక దాన్ని చూస్తూ నిలబడ్డాడు. నా చుట్టూచూచాను. ప్రతిసమాధీ తెరువబడింది. సమాధుల కింది శవాలన్ని పైకివొచ్చినయ్. తమ తమ బంధువర్గాలు రాసిన అసత్యాలన్నింటినీ చెరిపి, వారందరూ నిజాల్ని రాస్తున్నారు. బతికివున్న బంధువర్గం - తమను విడిపోయినవారికి ఎంత నిర్దయగా, క్రూరులుగా, పశువులవలె ప్రవర్తించి వారి ఆత్మల్ని ఎంతగా గాయపరిచారో అర్థమైంది. సిగ్గు లేకుండా, దొంగబుద్ధితో, క్రూరంగా, అవినీతిగా ఈర్ష్యతో కాలుతూ - జీవితంలో అనేక నీచకార్యాల్ని చేసిన యీ స్థిరనివాసంమీది రాతలబాధను భరించలేక - క్రూరమైన, భయంకరమైన సత్యాన్ని బైటపెడుతున్నారు! ఈ సత్యాన్ని గూర్చి అందరూ తెలియకుండా ఉన్నారా? లేక తెలిసినా - తెలియనట్టు నటించారా?

అప్పుడే నాకు తట్టింది - ఆమెకూడా తన సమాధి మీద నిజాన్ని బైటపెట్టి వుంటుందని! అటూ ఇటూ కదిలే శవాల్నీ అస్థిపంజరాల్ని దాటుకుంటూ వెంటనే ఆమె సమాధివైపు వెళ్ళా. ఆమెను దూరంనుంచే గుర్తుపట్టగలిగాను.

ఆ సాయంత్రం ఆమె సమాధిమీద చదివింది ఇది:

"ఆమె ప్రేమించింది; ప్రేమించబడ్డది; చనిపోయింది."

కాని ఇప్పుడు నేను చదివింది ఇది :

"ఆమె తన ప్రియుణ్ని మోసం చెయ్యాలనే దురుద్దేశంతో ఒక సాయంత్రం బైటికివెళ్ళి, వానలో తడిసి, నిమోనియాతో బాధపడి - చనిపోయింది."

తెల్లవారేప్పటికి సమాధి పక్కన స్పృహతప్పి పడివున్నట్టు తరువాత నాకు హాస్పిటల్‌లో చెప్పారు.